

నేడు కాగ్నా గంగాహారతి

తాండూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): యాలాల మండలం కోకట్ గ్రామ సమీపంలోని కాగ్నా నది వంతెన పక్కన బుధవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని గంగా హారతి కార్యక్రమాన్ని సాయంత్రం 6:30గంటలకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పౌర్ణమి రోజు బ్రహ్మణ పండితులచేత వైభవంగా జరుపబడే గంగాహారతి కార్యక్రమంలో హైందవులంతా పాల్గొన్నాలని బ్రాహ్మణ అర్చక, పురోహితుల సంఘం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



వైభవంగా రుద్రాభిషేకం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక మాసోత్సవంలో భాగంగా మంగళవారం కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర స్వామి గర్భాలయం లోని ఉదయం మూలవిరాట్‌కు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అలాగే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకొని, కార్తీక దీపాలు వెలిగించారు.

-కీసర, నవంబరు4(ఆంధ్రజ్యోతి)

కదిలిస్తే కన్నీరే..

విషాదంలో బాధిత కుటుంబాలు

రోదనలతో తల్లడిల్లిన వికారాబాద్ జిల్లా
అశ్రునయనాల మధ్య ముగిసిన అంత్యక్రియలు
తీరని శోకాన్ని మిగిల్చిన మీర్జాగూడ రోడ్డు ప్రమాదం



లక్ష్మీనారాయణపూర్‌లో రోదిస్తున్న మృతురాలు అఖిలారెడ్డి తల్లి అలివేలు



చేవెళ్ల మండలం, మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. పలు కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. ఉన్నంతలో ఆనందోత్సాహాలతో సాగుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. ప్రాణాలు కోల్పోయిన వారి అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితుల అశ్రునయనాల మధ్య జరిగాయి. తొమ్మిది మంది అంత్యక్రియలు, రోదనలతో తాండూరు నియోజకవర్గం తల్లడిల్లింది. ఎవరినీ కదిలించినా అయ్యో పాపం.. అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

నేడు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థికసాయం

తాండూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మీర్జాగూడ వద్ద బస్సు ప్రమాదంలో మరణించిన తాండూరు నియోజకవర్గానికి చెందిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున ఒక్కొక్కరికీ రూ.7లక్షల ఆర్థిక సహాయం చెక్కులను బుధవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్ అందజేయనున్నారు. ఇందిరమ్మ కాలనీ, గౌతాపూర్ రోడ్డు, వాల్మీకినగర్, బృందావన్ కాలనీ, పాత తాండూరు, హాజీపూర్, లక్ష్మీనారాయణపూర్, పేర్కంపల్లి గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

మరిన్ని వివరాలు 5లో..



ఆస్పత్రిలో బస్ కండక్టర్ రాధను పరామర్శిస్తున్న డీజీపీ శివధర్‌రెడ్డి

వికారాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మీర్జాగూడ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల నేపథ్యం వింటుంటే ఎంతటి పాషాణ హృదయమైనా ద్రవించకమానదు. ఈ ప్రమాదం తల్లిదండ్రులకు పిల్లలను, పిల్లలకు తల్లిదండ్రులను దూరం చేసింది. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న పలువురు విద్యార్థుల జీవితాలను చిదిమేసింది. కుటుంబాలకు తామే దిక్కుగా ఉన్న వారి ప్రాణాలను హరించి చిన్నారులను దిక్కులేని వారిని చేసింది. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ.. ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో 19 మంది మృత్యువాత పడగా, వారిలో 15 మంది వికారాబాద్ జిల్లాకు చెందిన వారే. తాండూరు పట్టణానికి చెందిన తొమ్మిది మంది మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే యాలాల్ మండలానికి చెందిన ముగ్గురు, దౌల్తాబాద్,

మిగతా 5వ పేజీలో...

వికారాబాద్ ఆసుపత్రుల్లో ఇద్దరే..!

- హైదరాబాద్‌కు నలుగురు తరలింపు
- డిశ్చార్జి అయిన మిగతా క్షతగాత్రులు

మీర్జాగూడలో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రుల్లో వికారాబాద్ ఆసుపత్రుల్లో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ప్రమాద ఘటనలో గాయపడ్డ వారిలో 12 మందిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో, మరో ఇద్దరినీ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరిన వారిలో టిప్పర్ యజమాని లక్ష్మణ్‌కు మెరుగైన చికిత్స కోసం సోమవారం హైదరాబాద్‌కు తరలించగా, అర్థోపెడిక్ సమస్యలు ఎదుర్కొంటున్న అబ్దుల్లా, సుమయా, అస్మాలు వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స పొందడానికి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లారు. షఫీ, ఖాజావలి, సయ్యద్ అస్మా, తసూరా మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరిలో పావని ఆరోగ్యం మెరుగు పడడంతో తమ ఇంటికి వెళ్లారు. ప్రస్తుతం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో స్వప్న (వికారాబాద్), ప్రైవేట్ ఆసుపత్రిలో వాహీద్ (వెల్చాల్)లు చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉంటే, అంతకు ముందు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎస్పీ నారాయణరెడ్డి, తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

ధ్వంసమైన బస్సు, టిప్పర్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

చేవెళ్ల/మొయినాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్, టిప్పర్ లారీని ప్రమాద స్థలం నుంచి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు సోమవారం అర్ధరాత్రి క్రేన్ సహాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే ప్రమాదంలో గాయాలపాలై చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 13 మంది క్షతగాత్రులను డీజీపీ శివధర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బస్ కండక్టర్ రాధతో మాట్లాడి ప్రమాద వివరాలపై ఆరా తీశారు. అలాగే ప్రమాద స్థలం వద్ద సహాయక చర్యలు చేపడుతుండగా గాయాలైన చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్‌ను చేవెళ్ల పోలీస్ క్వార్టర్స్‌కు వెళ్లి పరామర్శించారు. ఆయనతోపాటు అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాజేంద్రనగర్ డీసీపీ యోగేశ్ గౌతమ్, ఏసీపీలు బాలాజీనాయక్, కిషన్‌గౌడ్, సీఐలు, స్థానిక పోలీసులు ఉన్నారు.





మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్

పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

ఎకరాకు 13 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలి
శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్

వికారాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, పత్తి కొనుగోలు కేంద్రాలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతాయని రాష్ట్ర ప్రభుత్వం వారధిగా మాత్రమే ఉంటుందని స్పీకర్ ప్రసాద్ కుమార్ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గత సంవత్సరం మాదిరిగా కాకుండా ఈ సంవత్సరం ఎకరాకు 13క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలన్నారు. తేమ శాతం 8 నుంచి 12 శాతంగా తీసుకునే వారని ఇప్పుడు దాన్ని 16 శాతానికి పెంచాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వర్షాల కారణంగా పత్తిలో

మిగతా 6వ పేజీలో...

నేడు పరిగికి డిప్యూటీ సీఎం రాక...



పరిగి,నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం పరిగి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 3వ తేదీ ఆదివారం పర్యటన వాయిదా పడిన విషయం తెలిసిందే. దీంతో మళ్లీ బుధవారం పర్యటన ఖరారైంది. ముందుగా ఆయన పరిగి మండలం నజీరాబాద్ శివారులో కొత్తగా ఏర్పాటు చేయనున్న 400 కేవీ సబ్‌సెబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి రూ.8 కోట్ల విలువ చేసే విద్యుత్ పరికరాలను పంపిణీ చేస్తారు. కొత్తగా మంజూరైన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుకు శంకుస్థాన చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి. నజీరాబాద్‌తండా దగ్గర సభ ఉంటుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మేడ్చల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో దివ్యాంగుల వైకల్యాన్ని నిర్ధారించేందుకు చేపడుతున్న సదరం శిబిరాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి సాంబశివరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవయవ వైకల్యం, కంటి చూపు లోపం ఉన్న వారికి 6వ తేదీన, వినికిడి లోపం ఉన్న వారికి 11న, మానసిక దివ్యాంగులకు 15న ఇలా జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారన్నారు. సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చే వారు మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని ఆయన సూచించారు. స్లాట్ రశీదుతో పాటు గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ఎర్రగడ్డ, కోటి ఈఎన్టీ, సరోజిని దేవి ఆసుపత్రుల నుంచి ఇటీవల పొందిన మెడికల్ రిపోర్టు, ఆధార్ జిరాక్స్, పొటోలతో స్లాట్ బుకింగ్ కేటాయించిన రోజున ఉదయం 9 గంటలకు మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రిలో హాజరు కావాలని తెలిపారు.

హ్యామ్ స్కీమ్ కింద మేడ్చల్‌కు
5 రోడ్లు మంజూరు

మేడ్చల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ జిల్లాకు హైబ్రీడ్ అన్యూటీ మోడల్ రోడ్స్(హ్యామ్) స్కీమ్ కింద రాష్ట్ర ప్రభుత్వం ఐదు రోడ్లను మంజూరు చేసింది. ఈ రోడ్ల ప్రతిపాదనలు అసెంబ్లీలో ఆమోదం పొందడంతో టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. జిల్లాలో మేడ్చల్ - దుండిగల్ రోడ్డు 10కి.మీ, మేడ్చల్ - శామీర్‌పేట రోడ్డు 10కి.మీ, తూంకుంట - కొంపల్లి రోడ్డు 8కి.మీ, శామీర్‌పేట - ఘట్‌కేసర్ రోడ్డు 20కి.మీ, కీసర - తుర్కపల్లి రోడ్డు 15కి.మీ మొత్తం 63కి.మీ పొడవు రోడ్డు మంజూరైంది. దీనికోసం దాదాపు రూ.170 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం, మిగతా 60 శాతం బ్యాంకులు చెల్లించనున్నాయి. త్వరలోనే రోడ్డు పనులు చేపట్టనున్నట్లు రోడ్లు భవనాల శాఖ అధికారులు తెలిపారు.



భవిత కేంద్రంలో డీఈవో రేణుకాదేవి

బోధనలో నాణ్యతాప్రమాణాలు పెంచాలి

- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

పరిగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యాలో నాణ్యతా ప్రమాణాలు పెంచే విధంగా బోధన జరుగాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. బుధవారం పరిగి బాలికల ఉన్నత పాఠశాల, భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. టెన్త్‌క్లాసు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. మార్చిలో జరిగే పరీక్షలకు ఇప్పటి నుంచే సంసిద్ధం చేయాలన్నారు. విద్యార్థులు బలహీనంగా ఉన్న సబ్జెక్ట్‌ల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. భవిత కేంద్రానికి మరమ్మతులు, పెయింటింగ్ పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, హెచ్ఎం లావణ్య, సీఆర్‌పి చంద్రశేఖర్, ఐఈఆర్పీ జ్యోతి, మోహన్, శ్రీశైలంలు పాల్గొన్నారు.

మైనింగ్‌పై నివేదిక తయారీకి సూచనలు ఇవ్వండి

మేడ్చల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లా పరిధిలో బిల్డింగ్ స్టోన్, రోడ్డు మెటల్ తవ్వకాలపై సమగ్ర జిల్లా స్థాయి నివేదిక సిద్ధం చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి సైదులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని నీటి పారుదల, భూగర్భ జల, గనులు, భూగర్భ శాఖ, టీఎస్ఎండీసీ అటవీ, రెవెన్యూ, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కార్యాలయాలు తమ శాఖల వారీగా నివేదికలు సమర్పించాలని ఆయన కోరారు. ఈ నివేదికపై ప్రజలు సలహాలు, సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే ఈ 20వ తేదీ వరకు అందజేయాలన్నారు. ప్రజల సూచనలతో నివేదిక మరింత సమగ్రంగా మారుతుందని, ఖనిజ వనరుల సద్వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ఇది ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.



మేకల కాపరి ఆసిఫ్‌ను బయటకు తీసుకొస్తున్న స్థానికులు

ధారూరులో భారీ వర్షం

- కుమ్మరి వాగు వరదలో 5 మేకలు గల్లంతు
- వరదలో చిక్కుకున్న మేకల కాపరి

ధారూరు/పెద్దేముల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధారూరు పరిసర ప్రాంతంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ధారూరు శివారులోని కుమ్మరి వాగు పొంగి పొర్లింది. మేకల కాపరి ఆసిఫ్ 12 మేకలతో వాగు దాటుతూ వరదలో చిక్కుకుపోయాడు. వరదలో చెట్టును ఆసరాగా చేసుకున్న ఆసిఫ్‌ను, రక్షించేందుకు ధారూరు అటవీ రేంజ్ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉమేర్, అఫ్రిది, గఫార్ తాడు సహాయంతో కాపరి ఆసిఫ్‌ను వారు తాడుతో బయటకు లాగి రక్షించారు. అలాగే వరదలో చిక్కుకున్న 7 మేకలను రక్షించగా ఐదు మేకలు గల్లంతయ్యాయి. కాగా, భారీ వర్షానికి ధారూరు సబ్‌స్టేషన్ పరిధిలో

మిగతా 6వ పేజీలో...

బుగ్గక్షేత్రం.. జాతరకు సిద్ధం

● దక్షిణ కాశీగా ప్రసిద్ధి
● కోనేటిలో కొలువు దీరిన రామలింగేశ్వరుడు
● నేటి నుంచి ఉత్సవాలు



కోనేటిలో కొలువైన బుగ్గరామలింగేశ్వరుడు



ఆరుట్లలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రం

మంచాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా బాసిల్లుతున్న బుగ్గక్షేత్రం కార్తీక ఉత్సవాలకు ముస్తాబైంది. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల పరిధి బుగ్గరామలింగేశ్వర క్షేత్రంలో ఉత్సవాల నిర్వహణకు దేవాదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. యేటా కార్తీకంలో 15 రోజులు సాగే ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ నెల 5న(నేటి) కార్తీక పౌర్ణమి నుంచి అమావాస్య వరకు బుగ్గ జాతర కొనసాగుతుంది. ఇక్కడి నీటి ప్రవాహం తూర్పు నుంచి పడమర దిశకు పారుతూ కొండల్లోకి ప్రవహించడం ఇక్కడి ప్రత్యేకత. ఈ కోనేటిలో కార్తీక స్నానాలాచరిస్తే కష్టాలు తొలగి పుణ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. బుగ్గరామలింగేశ్వర క్షేత్రంలో ఉత్సవమూర్తులు గర్భగుడిలోకాక స్వయంభూగా నీటి ప్రవాహంలో వెలిసి దేవతా మూర్తులుగా పూజలందుకుంటున్నారు.

పరవళ్లు తొక్కుతున్న సెలయేరు...

నేటి నుంచి 20వ తేదీ అమావాస్య దాకా బుగ్గజాతర కొనసాగుతుంది. బుగ్గక్షేత్రంలో నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతోంది. కొండల నుంచి ప్రవహిస్తున్న ఈ నీటి ప్రవాహంలో కార్తీక స్నానాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారు. ఆరుట్ల నుంచి బుగ్గజాతర వరకు 4 కిలోమీటర్ల రోడ్డును రీబీటీ చేశారు. సీఐ మధు ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. జాతర ఉన్నన్ని 15రోజులు ఇక్కడ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తారు.

ఆరుట్ల జాతరకు ఇలా చేరుకోవాలి..

హైదరాబాద్‌కు 55కిలోమీటర్ల దూరంలో గల బుగ్గ జాతరకు చేరుకునేందుకు పలు రూట్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చే వారు ఇబ్రహీంపట్నం, మంచాల మీదుగా బుగ్గజాతరకు చేరొచ్చు. యాచారం-మాల్ ప్రాంతాల నుంచి వచ్చేవారు సాగర్ రహదారి గున్గల్-రంగాపూర్-జాపాల మీదుగా చేరుకోవచ్చు. అలాగే కందుకూరు, మహేశ్వరం రూట్ల నుంచి వచ్చేవారు సాగర్ హైవే ఆగాపల్లి మీదుగా జాపాల నుంచి బుగ్గజాతరకు చేరొచ్చు. చౌటుప్పల్ తదితర రూట్ల నుంచి వచ్చే వారు చౌటుప్పల్-రాచకొండ-ఆరుట్ల వీదుగా జాతరకు చేరుకోవచ్చు. ఆర్టీసీ ఇబ్రహీంపట్నం నుంచి జాతర జరిగే 15రోజుల పాటు ప్రతి అరగంటకో బస్సు సర్వీసు నడిపేలా ఏర్పాట్లు చేసింది.




పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే రంగారెడ్డి

మైసమ్మ తల్లో.. సల్లంగ చూడు

● నేటి నుంచి మైసిగండిలో మైసమ్మ బ్రహ్మోత్సవాలు
● ఆరు రోజుల పాటు జాతర.. భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు



ఉత్సవాలకు సిద్ధమైన మైసమ్మ ఆలయం



కొలువైన అమ్మవారు

కడ్తాల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పేదల ఇలవేల్పు... ఆపద మొక్కుల అమ్మ.. శక్తి స్వరూపిణిగా వెలుగొందుతున్న కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయం బ్రహ్మోత్సవాల(జాతర)కు ముస్తాబైంది. బుధవారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. మైసమ్మ బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా కార్తీక పౌర్ణమి నుంచి కార్తీక పంచమి వరకు నిర్వహిస్తారు. ఆలయ మహత్యం, స్థల ప్రాధాన్యం సంతరించుకున్న మైసమ్మ ఆలయంలో ఆరు రోజులు జాతర జరుగుతుంది. బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. జాతరకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు తరలిరానున్నారు.

ఏర్పాట్ల పరిశీలన ..

మైసమ్మ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ పరిశీలించారు. నేటి నుంచి పదో తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల్లో భక్తులు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశించారు. భక్తులకు దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈ సందర్భంగా సిరోలిపంతూ తెలిపారు.

కందుకూరులో ఘనంగా సదర్



సదర్ వేడుకలో అంజయ్యయాదవ్, స్థానికులు

కందుకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కందుకూరులో సోమవారం రాత్రి సదర్ సమ్మేళనాన్ని నిర్వహించారు. సీతారామ శ్రాస్త్రి కాలనీ నుంచి కందుకూరు-యాచారం రోడ్డు వరకు దున్నపోతులతో ర్యాలీ నిర్వహించారు. యాదవ సంఘం మహిళలు బతుకమ్మ ఆటలతో సదర్‌ను ప్రారంభించారు. సంఘం మండల అధ్యక్షుడు పసుపుల పర్వతాలు, ఉపాధ్యక్షుడు కె.బాల్‌రాజ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్‌లో షాద్‌నగర్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్ యాదవ్ పాల్గొన్నారు. సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యతను చాటుతాయన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కడారి జంగయ్యయాదవ్, ఎ.అనిల్‌కుమార్, జె.లక్ష్మయ్య, పోతర్ల సుదర్శన్, నరేష్, డి.తిరుమలేశ్, డి.క్రిష్ణ, శ్రీశైలంయాదవ్‌లు పాల్గొన్నారు.

బాబోయ్ మొసళ్లు

» వెండికొండ సిద్ధేశ్వరాలయ సమీప కాలువలో సంచారం
» ఆందోళన చెందుతున్న స్థానికులు, భక్తులు



శంషాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ప్రసిద్ధ వెండికొండ సిద్ధేశ్వరస్వామి(సిద్దులగుట్ట) ఆలయం ఎదుట కాల్వలో మంగళవారం మొసలి కలకలం సృష్టించింది. స్థానికులు, భక్తులు దానిని చూసి భయాందోళనకు గురయ్యారు. కార్తీక మాసం కావడంతో ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి వేలదిమంది భక్తులు కార్తీక దీపాలు వెలిగించడానికి తరలివస్తారు. భక్తుల రద్దీ ఎక్కువ ఉంటుంది. ఈ కాలువ హిమాయత్‌సాగర్ జలాశయాలకు నీరందించే పలు కాల్వలతో కలుస్తుంది. ఈ కాలువల్లో చేపల వేటకు వెళ్లొద్దని స్థానికులు వేటగాళ్లను కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మొసళ్లను పట్టుకొని తరలించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఇబ్రహీంపట్నం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపోల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ నెట్‌బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో విక్రమ్, హారికలు ప్రతిభ చూపి ఎంపికయ్యారు. అలాగే అండర్-14 విభాగంలో జస్విక్, అఖిల్, లక్ష్మీప్రసన్న, శ్రీలత ఎంపికైనట్లు పీఈటీ రాజు తెలిపారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.



నెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అవినీతి సొమ్ముతో లబ్ధికి బీఆర్‌ఎస్ యత్నం

ఆమనగల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అవినీతి సొమ్ముతో రాజకీయ లబ్ధికి బీఆర్‌ఎస్ ఉప ఎన్నికలో గెలిచే కుట్ర చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమిని తప్పదనే విపక్షాలు అవాకులు, చెవాకులు పేలుతున్నాయని అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, కల్వకుర్తి, మాడ్గుల, వెల్దండ మండలాల నాయకులతో కలిసి మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడలో నారాయణరెడ్డి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, కార్పొరేషన్ల ఛైర్మన్‌లు బెల్లయ్యా నాయక్, శివసేనారెడ్డిలతో కలిసి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపిస్తే నియోజకవర్గం ఆశించిన రీతిలో అభివృద్ధి చెందుతుందని కసిరెడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు ఓటర్లు నీరాజనం పలుకుతున్నారన్నారు. 22 నెలల కాంగ్రెస్ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందన్నారు. జూబ్లీహిల్స్‌లో విజయంతో సీఎం రేవంత్‌రెడ్డికి మరింత పట్టు లభిస్తుందని, ఇక్కడి పేదలంతా కాంగ్రెస్‌కు అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలాజీసింగ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, భాస్కర్‌రెడ్డి, మండ్లి రాములు, కేశవులు, సాయిరెడ్డి, సత్యం, బీక్యానాయక్, చేగూరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువు ఇష్టం లేక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

పూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తనకు చదువు ఇష్టం లేదని జీవితంపై విరక్తి చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ జిల్లా చెన్గోముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూడూరు మండలం చిన్నబండ తండాకు చెందిన మూడావత్ రవి-జ్యోతిల కూతురు స్వాతి(16) మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కొన్ని రోజులుగా తనకు చదువు ఇష్టం లేదంటూ స్వాతి తన తల్లితో తెలిపింది. తల్లిదండ్రులు కూతురికి నచ్చజెప్పి పంపారు. ఈ నెల 1న తనకు ఆరోగ్యం బాగాలేదని స్వాతి ఇంటికొచ్చింది. తనకు చదవడం ఇష్టం లేక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్వాతి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలా ఆక్రమణల కూల్చివేత

- స్థానికుల ఫిర్యాదుతో చర్యలు తీసుకున్న హైడ్రా



నాలా కబ్జాలను తొలగిస్తున్న హైడ్రా

శామీర్‌పేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నాలాలు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే ఎంతటి వారైనా సహించేది లేదని హైడ్రా ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం తూంకుంట మున్సిపల్ పరిధి దేవరయంజాల్‌లో నాలాపై ఆక్రమణలను హైడ్రా ఆధ్వర్యంలో మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది కూల్చివేశారు. మహాలక్ష్మి వెంచర్ వద్ద గల గోదాముల యజమానులు నాలాపై నిర్మాణాలు చేశారు. వదర నీరు, డ్రైనేజీ నీరు వెళ్లలేక నిలిచిపోయింది. కాలనీలు, రోడ్లపై భారీగా నీరు నిలిచింది. దీంతో ప్రజలు నెలక్రితం హైడ్రాకమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి దేవరయంజాల్‌లో పర్యటించి పరిశీలించారు. మంగళవారం హైడ్రా రంగంలోకి దిగి పోలీసుల బందోబస్తు మధ్య నాలాలపై నిర్మాణాలను జేసీబీతో కూల్చేసింది. అధికారులు నాలాలను తవ్వి పునరుద్ధరించారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ టీపీవో స్రవంతి, డీఈఈ సునీత, ఏఈ శిరీష, ఇరిగేషన్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ వాసు పాల్గొన్నారు.

శామీర్‌పేటలో అథ్లెటిక్స్ క్రీడాపోటీలు

రేపటి నుంచి 13వ తేదీ వరకు క్రీడోత్సవాలు

16 గురుకుల పాఠశాలల నుంచి 1,200 క్రీడాకారులు



క్రీడాపోటీలకు ఏర్పాట్లు చేస్తున్న పీడీ వెంకట్‌రెడ్డి, పీఈటీలు

శామీర్‌పేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల గ్రౌండ్స్‌లో హైదరాబాద్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలను నిర్వహిస్తామని ప్రిన్సిపల్ రవికుమార్ మంగళవారం తెలిపారు. క్రీడలను ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ క్రీడాపోటీలకు గురుకులం స్పోర్ట్స్ గ్రౌండ్‌ను సిద్ధం చేస్తున్నారు. ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో ఫిజికల్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, పీఈటీలు సాయికుమార్, సాయిబాబ, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను జిల్లా స్పోర్ట్స్ అధికారులు సందర్శించారు.

అథ్లెటిక్స్ క్రీడల్లో 1,200 మంది క్రీడాకారులు

జిల్లా స్థాయిలో అండర్ 14, 17, 19ఏజ్ గ్రూప్‌లకు చెందిన హైదరాబాద్ పరిధి 16 గురుకులాల 1,200 మంది క్రీడాకారులు క్రీడాపోటీల్లో పాల్గొననున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టెన్నికాయిట్, చెస్ తదితర క్రీడాపోటీలను నిర్వహిస్తారు.


మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి

- ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిద్ది సుధాకర్

వికారాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారం అందించడంతో పాటు బాధిత కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ డాక్టర్ దిద్ది సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదానికి కారణమైన వారిపైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఏవోకు ఆయన ఆప్, ఏఐపీఎస్‌వో రాష్ట్ర నాయకులతో కలిసి పలు డిమాండ్లు, సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు ప్రమాదం సాధారణమైనది కాదని, ఇది ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్య ఫలితమేనన్నారు. ఈ ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రవాణా శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జీవో 111 పేరిట రహదారి పొడవునా భూములు కబ్జా చేసి వాటిని కాపాడుకోవాలని కొందరు చేస్తున్న కుట్రల కారణంగానే రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. ముఖ్యమంత్రి, స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ప్రధాన రహదారి ఇంత దరిద్రంగా ఉండడం గర్హనీయమన్నారు. ఆయనతో పాటు ఆప్ రాష్ట్ర మాజీ కన్వీనర్ బుర్రా రాము గౌడ్, హేమ సుదర్శన్ జిల్లోజు, జావీద్ షరీఫ్, రమ్య గౌడ్, లియాకత్ ఖాన్, పట్లోళ్ల అమరేందర్‌రెడ్డి, విజయలక్ష్మిపండిత్ ఉన్నారు.

వికారాబాద్‌కు నిధులు తెస్తా

- కడాతో వికారాబాద్‌కు ఉపయోగకరం
- ఏడాదిలోగా మెడికల్ కళాశాల పూర్తి చేస్తా
- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



వికారాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులతో త్వరలోనే రివ్యూ సమావేశం నిర్వహిస్తానని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సోమవారం చేవెళ్ల సమీపంలో జరిగిన బస్సు ప్రమాదం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఈ ఘటన దురదృష్టకరమని అన్నారు. తాను సీఎంను అడిగినందుకే గ్రీన్ ట్రిబునల్ వారితో మాట్లాడి కేసు ఎత్తివేయడం జరిగిందని, త్వరలోనే మంత్రులతో మాట్లాడి త్వరితగతిన అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో కాడా ద్వారా పనులు జరుగుతున్నాయని, వాటితో వికారాబాద్ ప్రాంతానికి కూడా కొంత ఉపయోగం కలుగుతుందని చెప్పారు. కొడంగల్ నుంచి పలు రోడ్లు పరిగి, వికారాబాద్, తాండూరుకు వస్తాయన్నారు. వికారాబాద్‌లో మెడికల్ కళాశాలను ఒక సంవత్సరంలో పూర్తిచేస్తామని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ అభివృద్ధీ చేయలేదని, రాష్ట్రానికి రూ.8లక్షల కోట్ల అప్పు మాత్రం చేశారన్నారు. అసలు, వడ్డీలు చెల్లించడం వల్లే అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడుతోందని, చేయాల్సిన పనులకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ, నాయకులు సుధాకర్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కిషన్‌నాయక్, రాజశేఖర్‌రెడ్డి, షరీఫ్, రాంచందర్‌రెడ్డి, ఎర్రవల్లి జాఫర్ పాల్గొన్నారు.

కదిలిస్తే కన్నీరే..

(మూడో పేజీ తరువాయి)



హాజీపూర్‌లో మృతుల ఇంటి వద్ద గ్రామస్తులు

వికారాబాద్, బషీరాబాద్ మండలాలకు చెందిన ఒక్కొక్కరు ప్రాణాలు కోల్పోవడం వారి అంత్యక్రియల్లో గ్రామస్తులు, నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు అందరినీ కదిలించాయి. వారి రోదనలు చూసిన వారందరూ కన్నీటి పర్యంతమయ్యారు.

గుండెలవిసేలా రోదించిన స్నేహితురాళ్లు

రోడ్డు ప్రమాదంలో నందిని, తనూష, సాయిప్రియ మృతి చెందిన సమాచారం తెలుసుకున్న వారి స్నేహితురాళ్లు గుండెలవిసేలా రోదించడం పలువురిని కంటతడి పెట్టించింది. యాలాల్ మండలం, హాజీపూర్‌కు చెందిన భార్యాభర్తలు లక్ష్మి, బందెప్ప మృతి చెందడంతో వారిద్దరు కూతుళ్లు అనాథలుగా మారారు. తాండూరుకు చెందిన ఓ కుటుంబంలో తండ్రి, కూతురుతో పాటు 40 రోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోవడం అందరినీ కలిచివేసింది. ఇంట్లో నుంచి సంతోషంగా బయలుదేరిన వారు రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో వెళ్లిన వారు గంటల్లోనే శవాలుగా మారారు.



రోదిస్తున్న ఎల్లయ్యగౌడ్

కన్నీటి సంద్రం

యాలాల్ మండలం, పేర్కంపల్లిలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు అక్కా చెల్లెళ్లు నందిని, తనూష, సాయిప్రియ అంత్యక్రియలు సోమవారం రాత్రి జరిగాయి. తమ గ్రామానికి చెందిన ముగ్గురు అక్కా చెల్లెళ్ల మృతి చెందిన సమాచారం తెలుసుకున్న ఆ గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకున్నాయి. వారి అంత్యక్రియలకు ఊరు ఊరంతా కదిలివచ్చింది. వారి చివరి చూపు కోసం తాండూరు, పరిసర ప్రాంతాల వారితో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా తరలివచ్చి నివాళులర్పించారు. యాలాల్ మండలం, హాజీపూర్‌లో లక్ష్మి, బందెప్పలు, తాండూరులో ఇందిరానగర్‌కు చెందిన షేక్ ఖాలీద్, సలేహాబేగం, ఆమె కూతురు జహీరా ఫాతిమా, బృందావన్ కాలనీకి చెందిన తబస్సుమ్, గౌతాపూర్‌కు చెందిన ముస్కాన్‌బేగం, వాల్మీకి నగర్‌కు చెందిన వెంకటమ్మ అలియాస్ స్వప్న మంగళవారం జరిగాయి. వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని శ్రీరాంనగర్‌కు చెంతిన తారీబాయి అంత్యక్రియలు సోమవారం రాత్రి నిర్వహించారు. మృతుల కుటుంబాల్లో ఎవరినీ కదిలించినా.. జరిగిన ఘటనను తలచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టకపోతే సచివాలయాన్ని ముట్టడిస్తాం : మాజీ ఎమ్మెల్యే పైలెట్

వికారాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/తాండూరు: మన్నెగూడ నుంచి అప్పా జంక్షన్ వరకు బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను వెంటనే చేపట్టకుంటే పార్టీలకతీతంగా సెక్రటరియేట్‌ను ముట్టడిస్తామని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి హెచ్చరించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించిన తర్వాత మీడియాతో మాట్లాడారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వం రోడ్డు విస్తరణ చేపట్టకుంటే ప్రజాగ్రహాన్ని చవిచూస్తారని హెచ్చరించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

బస్సు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రోహిత్‌రెడ్డి మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి రూ.10వేల చొప్పున ఆర్థికసహాయం అందజేశారు. లక్ష్మీనారాయణపూర్‌లో అఖిలారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన చిన్నారులకు తోడ్పాటునందిస్తానన్నారు. ఆయనతో నాయకులు నయీం(అప్పు), రవీందర్‌రెడ్డి, ముక్తార్ నాజ్, పట్లోళ్ల నర్సిములు ఉన్నారు.

బీజాపూర్ హైవే పనులను వెంటనే పూర్తి చేయాలి



తాండూరులో డెవలప్‌మెంట్ ఫోరమ్ నిరసన

షాబాద్/తాండూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బీజాపూర్ జాతీయ రహదారి పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో బీజాపూర్ జాతీయ రహదారిపై సీపీఎం, ఎఎఫ్‌ఐల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. భాస్కర్ మాట్లాడుతూ.. సోమవారం జరిగిన ప్రమాదం అందరినీ కలచివేసిందని, బీజాపూర్ రహదారిపై పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని డిమాండ్ చేశారు. అలాగే హైవే పనులను ప్రారంభించి త్వరగా పూర్తిచేయాలన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయపడిన వారికి రూ.10లక్షల సహాయం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జగదీష్, నాయకులు దేవేందర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు బాగుచేయాలని నిరసన

అధ్వానంగా మారిన రోడ్లను బాగుచేయాలని మంగళవారం తాండూరు డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని విలియమూన్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. పార్టీలకు అతీతంగా నిర్వహించిన ఈ ధర్నాలో వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు. మీర్జాగూడ బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చేరుకొని మద్దతు తెలిపారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డును బాగుచేయాలని, మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 2023 ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసినా కోర్టులో ఉన్న కేసులపై స్పందించకుండా ఈ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని రోహిత్‌రెడ్డి ఆరోపించారు. అనంతరం రోడ్లు బాగు చేయాలని కోరుతూ తహసీల్దార్ తారాసింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో తాండూరు డెవలప్మెంట్ ఫోరం ప్రతినిధి కమల్తార్, టీజేఏఎస్ ఇన్‌చార్జి సోమశేఖర్, వివిధ పార్టీల నాయకులు గోపాలకృష్ణ, శోభారాణి, ఆసిఫ్, అనురాధ, సంగీత, రాజ్‌కుమార్, రాజుగౌడ్, విజయలక్ష్మిపండిత్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

రూ.50లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి

షాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కో వ్యక్తిపై రూ.50లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాకేష్ అన్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని మంగళవారం చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున, గాయపడ్డవారికి రూ.10లక్షలు వెంటనే చెల్లించాలన్నారు.

బస్సు ప్రమాద ఘటన విషాదకరం

షాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటన విషాదకరమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ప్రవీణ్ కుమార్ మాదిగ అన్నారు. మంగళవారం చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ.కోటి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు.

అదృష్టం బాగుండి బయటపడింది

పెద్దేముల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తన అన్న కూతురు అదృష్టం బాగుండి ప్రమాదం నుంచి బయటపడిందని స్వప్న బాబాయ్ మల్లేశం అన్నారు. ఖానాపూర్‌నకు చెందిన స్వప్న హైదరాబాద్‌లో బీఎస్సీ నర్సింగ్ చేస్తోందని, సర్టిఫికెట్లు తీసుకునేందుకు ఆదివారం వచ్చి సోమవారం ఉదయం బస్సుకు బయలుదేరిందని చెప్పారు. వెళ్లిన గంటకే బస్సు ప్రమాదానికి గురైందని ఫోన్ రావడంతో ఆందోళనకు గురయ్యామని చెప్పారు. వెంటనే అక్కడికి చేరుకున్నాక అక్కడి పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోయిందని, మా కూతురుతో మాట్లాడాక కాస్త కుదుటపడినా.. చనిపోయిన వారిని చూసి బాధపడ్డామన్నారు. తమ కూతురు వికారాబాద్‌లో చికిత్స పొందుతోందన్నారు.

మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో... చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

- ఇద్దరు డిశ్చార్జి, మరో యువతిని నిమ్స్‌కు తరలింపు
- చికిత్స పొందుతున్న 13 మంది రోడ్డు ప్రమాద బాధితులు



మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

చేవెళ్ల/మొయినాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ -బీజాపూర్ జాతీయ రహదారిపై జరిగిన ఆర్‌టీసీ బస్-కంకర టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన 15 మంది క్షతగాత్రులు చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. చికిత్స పొందుతున్న తాండూరుకు చెందిన మాజీద్ భార్య ఇదే ప్రమాదంలో మృతిచెందడంతో ఆమె అంత్యక్రియల కోసం అతడిని మంగళవారం కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. అతడి ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు తెలిపారు. తాండూరుకు చెందిన సాయిశ్రీ ఆరోగ్యం మెరుగుపడటంతో డిశ్చార్జి చేశారు. నందిని అనే యువతిని హైదరాబాద్లక్షణజ నిమ్స్‌కు ఆమె కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. చేవెళ్ల మండలం అంతారానికి చెందిన నర్సింలు, సూజతతో పాటు 13 మంది చికిత్స పొందుతున్నారు.

కాలు విరిగింది



మాది పూడూరు మండలం. నేను ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తా. రోజు మాదిరిగానే హైదరాబాద్‌లో డ్రైవింగ్ చేసేందుకు వెళ్తుండగా ప్రమాదం బారినపడ్డా. నా తలకు గాయమైంది. కాలు విరిగింది. మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు.

- అఖిల్‌ఖాన్, పూడూరు

డ్యూటీకి పోతుండగా..



ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వద్ద గన్‌మన్‌గా పనిచేస్తున్నా. ఇందులో భాగానే డ్యూటీకి వెళ్లేందుకు రోజు మాదిరిగానే ఆర్టీసీ బస్సులో వస్తుండగా ప్రమాదం జరిగింది. కాలుకు, చేతికి బలమైన దెబ్బలు తగిలాయి. ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నా. ప్రమాదం లేదని వైద్యులు చెప్పారు.

- దయాకర్, కానిస్టేబుల్

బాగా నొప్పి వేస్తుంది ...



నా తలకు తీవ్ర గాయాలయ్యాయి. శరీరమంతా దెబ్బలు తగిలి బాగా నొప్పులయ్యాయి. ప్రమాద సంఘటన నుంచి నేను ఇంకా తేరుకోలేకున్నాను. చనిపోయిన ప్రయాణికులకు తలుచుకుంటే దుఃఖం వస్తోంది. నాకు వైద్యులు వైద్యం బాగానే చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారు.

- రాధ, బస్సు కాండక్టర్

విద్యుదాఘాతంతో హోంగార్డు మృతి

- ఆసుపత్రికి వెళ్లి పరిశీలించి సంతాపం తెలిపిన ఎస్పీ



శ్రీనివాస్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



శ్రీనివాస్(ఫైల్)

వికారాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఓ హోంగార్డు మృతిచెందిన సంఘటన వికారాబాద్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చేవెళ్ల మండలం కౌకుంట్లకు చెందిన హోంగార్డు శ్రీనివాస్(37) వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో 15ఏళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం పోలీస్ వాహనాన్ని కడుగుతున్న క్రమంలో స్టార్టర్ ఆన్ చేయబోయి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే పోలీస్ సిబ్బంది అతడిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాస్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆసుపత్రికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. శ్రీనివాస్ మృతదేహానికి సంతాపం తెలియజేశారు.

శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటాం: ఎస్పీ

హోంగార్డు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలో ఎంటీ సెక్షన్(మోటారు ట్రాన్స్‌పోర్ట్)లో విధులు నిర్వహిస్తూ కరెంటుషాక్‌తో మృతిచెందిన సీహెచ్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసు శాఖ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శ్రీనివాస్ మృతి తమను కలిచి వేసిందని, ఇది పోలీస్ శాఖకు తీరని లోటు అని పేర్కొన్నారు. శ్రీనివాస్ మరణానికి సంబంధించి ఉన్న అనుమానాలు దృష్టిలో ఉంచుకుని, అతడు పని చేస్తున్న ప్రాంతంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడా? లేదా మరేదైనా కారణమా? అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో పోస్ట్‌మార్టం నివేదిక కీలకం అవుతుందని, ఆ నివేదికొచ్చే వరకు ఎలాంటి ముందస్తు నిర్ధారణకు రాదని ఎస్పీ తెలిపారు. అతడి కుటుంబానికి శాఖాపరంగా అన్ని విధాలా సహకరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పాల్గొన్న లగచర్ల, పోలెపల్లి, హకీంపేట్ గ్రామాల రైతులు



పాలాభిషేకం చేస్తున్న రాజేశ్‌రెడ్డి, నాయకులు

దుద్యాల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూములిచ్చిన హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల గ్రామాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారు. ఆ గ్రామాల్లో రూ.7,600 కోట్లతో ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయనున్నారు. ఆయా గ్రామాల రైతులు, ప్రజలు పోలెపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. పోలపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి, నాయకుడు నరసింహారెడ్డిలు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నారన్నారు. కొడంగల్‌లో అభివృద్ధిని ఓర్వలేక ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, కేటీఆర్‌లు అసత్య ప్రచారానికి ఒడిగట్టారన్నారు. రైతులు మాట్లాడుతూ.. తమకు భూమి కోల్పోయిన బాధ ఉన్నా.. ఒకే దఫాలో పరిహారం ఇవ్వడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఛైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి, జయరాములు, శ్రీనివాస్, చెన్నప్ప పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

(మూడో పేజీ తరువాయి)


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

తేమ శాతం పెరిగి ఉంటుందని రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు. గతంలో ఎల్1, ఎల్2, ఎల్3 ప్రకారం బిల్లులు చేసేవారని ఆ విధానం ఎత్తివేసి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేయాలని కోరారు. బీజేపీ ఎంపీలతో మాట్లాడి కేంద్రం ప్రభుత్వ దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు సుధాకర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కిషన్ నాయక్, రాజశేఖర్ రెడ్డి, షరీఫ్, రాంచందర్ రెడ్డి, ఎర్రవల్లి జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగనీయొద్దు

పత్తి అమ్మకానికి వచ్చే రైతులకు మిల్లుల యాజమాన్యం, సీసీఐ అధికారులు ఇబ్బందులకు గురిచేయొద్దని స్పీకర్ ప్రసాద్ కుమార్ సూచించారు. మంగళవారం వెంకటాపూర్ సమీపంలోని అయ్యప్ప కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం, అలాగే మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. భారీ వర్షాల కారణంగా రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాణ్యత పేరిట పత్తిని తిరస్కరించకుండా తప్పని సరిగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. 2025 - 26 సంవత్సరానికి పత్తి కనీస మద్దతు ధర రూ.8,110గా నిర్ణయించినట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో సుమారు 50 వేల మంది పత్తి రైతులుండగా, మొత్తం 14 జిన్నింగ్ మిల్లుల ద్వారా 14 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు విస్తృత అవగాహన కల్పించేందుకు అన్ని గ్రామాల్లో ఏఈఓలు వ్యవసాయ అధికారులు సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని 34 వార్డులకు చెందినవారికి కల్యాణలక్ష్మి, షాది ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, వ్యవసాయ అధికారి రాజారత్నం, తహసీల్దారు లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మిల్లుల యజమాని వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధారూరులో భారీ వర్షం

(మూడో పేజీ తరువాయి)


జైరాంతండా సమీపంలోని ఉప్పొంగుతున్న వాగు

విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సాయంత్రం వరకు సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం పడినప్పుడల్లా మంబాపూర్ వద్ద 33 కేవీ విద్యుత్ లైన్ బ్రేక్ డౌన్ కావటం పరిపాటిగా మారిందని వినియోగదారులు వాపోతున్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్ మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలోని జైరాంతండా సమీపంలోని కల్వర్టుపై నుంచి వాగు పొంగిపొర్లింది. దాంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పత్తి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. బషీరాబాద్‌లో రైల్వేగేటు సమీపంలోని బషీరాబాద్-మైల్వార్ రోడ్డులోకి కల్వర్టు వరదనీటితో ఉప్పొంగి ప్రవహించింది. దీంతో రెండు గంటలపాటు వాహనాల రాకపకలు ఎక్కడికక్కడ నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

పంటలకు నష్టం..

పరిగి: తుపాను ప్రభావంతో పరిగి సబ్ డివిజన్‌లోని పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. దీంతో చేతికొచ్చిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. పత్తి తీస్తున్న సమయంలో ఈ వర్షంతో ప్రధానంగా పత్తి నల్లబారుతోందని తెలిపారు.


పరిగి శివారులో వర్షానికి నల్లబారిన పత్తి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● భర్తకు తీవ్రగాయాలు ● మరో ముగ్గురికి స్వల్పగాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వికారాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో ఓమహిళ మృతిచెందగా ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణానికి చెందిన తులసీరాం, భారతి(42) భార్యభర్తలు. అనంతగిరి కార్తీక మాస పెద్దజాతరలో భాగంగా అనంతగిరిలో వ్యాపారం నిమిత్తం షాపు నిర్వహిస్తున్నారు. ఈ దంపతులు మంగళవారం అనంతగిరి నుంచి వికారాబాద్‌కు బైక్‌పై వస్తుండగా ఎస్ఏపీ కళాశాల సమీపంలో వేగంగా వచ్చిన గుర్తుతెలియని కారు వేగంగా వచ్చి స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో భారతి, తులసీరామ్‌కు తీవ్రగాయాలయ్యాయి. కారు అదేవేగంతో రోడ్డుపక్కన నిలబడిన ఏపీ రాష్ట్రం కర్నూల్‌కు ఎమిగనూర్‌కు చెందిన చిన్న, లక్ష్మణ్, శ్రీనులపైకి దూసుకెళ్లింది. దీంతో వారికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో భారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. భర్త తులసీరామ్ పరిస్థితి విషమంగా ఉంది. కర్నూల్‌కు చెందిన ముగ్గురు యువకులకు చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

పూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పూడూరు గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. షాబాద్ మండలం తమ్మారెడ్డిగూడకు చెందిన పుల్‌మామిడి జంగయ్య రెండో కుమారుడు పుల్‌మామిడి సంజీవ(27) అదే గ్రామానికి చెందిన ఓయువతిని గత ఎనిమిదేళ్లుగా ప్రేమిస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆమె తనతో మాట్లాడటం లేదని సంజీవ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో యువకుడు ఈనెల 3వ తేదీన సాయంత్రం 6గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. పూడూరు గ్రామశివారులో సంజీవ గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుక్కను తప్పించబోయి..

● పొలాల్లోకి దూసుకెళ్లిన కారు ● తప్పిన ముప్పు


మన్‌సాన్‌పల్లి వద్ద పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

పెద్దేముల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుక్కను తప్పించబోయి కారు అదుపుతప్పి వ్యవసాయ పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటన పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ నుంచి తాండూరుకు వస్తున్న ఓ కారు మన్‌సాన్‌పల్లి గ్రామ సమీపంలోకి రాగానే కుక్క అడ్డు వచ్చింది. దీంతో డ్రైవర్ కుక్కను తప్పించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదు. దీంతో కారులో ఉన్నవారు ఊపిరిపీల్చుకున్నారు.

లైసెన్స్ లేని పది ఆటోల సీజ్

యాలాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రధాన రహదారిలో ఎస్ఐ విఠల్‌రెడ్డి మంగళవారం వాహన తనిఖీ చేపట్టారు. ఆటోలు, అధిక లోడ్ వాహనాల తదితర వాహనాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇందులో లైసెన్స్ లేకుండా నడుపుతున్న పది వాహనాలను సీజ్ చేశామన్నారు. చలాన్లు జారీ చేసి వాహనాలను యజమానులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై కేసులు

కీసర రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలించే వారిపై కేసులు నమోదు చేసినట్లు కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి అంకిరెడ్డిపల్లి ప్రాంతంలో మంగళవారం ప్రభుత్వ, సీలింగ్ భూముల్లో మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు పోలీస్, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా మట్టిని తవ్వుతున్న దుండగులు వాహనాలను అక్కడే వదిలేసి పరారయ్యారు. ఒక హిటాచి, మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కొండెల్ల రాజు, వరుణ్, రామరాజు, నర్సింహులు పరారైనట్లుగా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కులకచర్ల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొంరెడ్డిపల్లిలో అక్రమంగా కొనసాగుతున్న ఫిల్టర్ ఇసుక డంపులను సీజ్ చేసినట్లు ఎస్సై రమేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పక్కా సమాచారంతో ఎస్సై పోలీసు సిబ్బందితో ఫిల్టర్ ఇసుక డంపులపై దాడులు నిర్వహించారు. నిల్వ ఉన్న ఫిల్టర్ ఇసుక డంపులను సీజ్ చేశారు. ఇసుక తయారీకి ఉపయోగించే పైపులు, అక్కడే ఉన్న రెండు ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక తయారు చేసినా, నిల్వ ఉంచినా, ట్రాక్టర్‌లలో తరలించినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజ్ చేసిన ఫిల్టర్ ఇసుక డంపులను తహసీల్దార్ మనోహరచక్రవర్తికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

పరిగి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పరిగి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర విద్యుదాఘాతంతో ఓ ఆవు మృత్యువాతపడింది. సాయిరాంకాలనీకి చెందిన గంగనోళ్ల భారతమ్మకు చెందిన ఆవును మంగళవారం మార్కెట్‌కు మేతకు తీసుకెళ్లగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. నిత్యం ఐదు లీటర్ల పాలు ఇచ్చేదని, పాలను అమ్మిన డబ్బుతోనే జీవనం సాగిస్తున్నానని భారతమ్మ కన్నీటి పర్యంతమైంది. ఆవు విలువ రూ.80 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది.

కోలుకున్న ఎద్దు

ధారూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధారూరు పశువైద్యశాలలో రైతు నాగయ్యకు చెందిన ఎద్దు సోమవారం వైద్యం వికటించి అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. కాగా మంగళవారం అందించిన వైద్యంతో ఆ ఎద్దు కోలుకుంది. పశువైద్యశాల ఔట్ సోర్సింగ్ ఆఫీస్ సబార్డినేట్ బాబురావు ఎద్దుకు వైద్యం చేశారు. అనంతరం ఎద్దు కోలుకుని లేచి నిలబడి ఆరోగ్యంగా మారిందని బాబురావు తెలిపారు.

మత్స్యకారులకు ప్రభుత్వ చేయూత


చేపపిల్లలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

మేడ్చల్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టి జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులకు చేయూతనివ్వాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపపిల్లలను పంపిణీ చేస్తోందని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్ అన్నారు. మేడ్చల్ మత్స్య శాఖ కార్యాలయంలో మంగళవారం స్థానిక మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఫిషరీస్ అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వేగు రాజు, బిక్షపతి పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు ఏర్పాట్లు

మేడ్చల్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని కిష్టాపూర్ గురుకుల పాఠశాలలో ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న పాఠశాల, జూనియర్ కళాశాలల విద్యార్థుల జోనల్‌స్థాయి ఆటల పోటీల నిర్వాహణకు మంగళవారం అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. క్రీడా ప్రాంగణాన్ని చదును చేయించి సిద్ధం చేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఆటలపోటీల నిర్వాహణ బాధ్యతలు అప్పగించిన పీటీలు, పాఠశాలల ప్రిన్సిపాల్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆటల పోటీల్లో పాల్గొనటానికి వచ్చే క్రీడాకారులకు వసతులు కల్పించడానికి అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లలిత తెలిపారు.

గురుకుల్ అభివృద్ధికి తోడ్పడాలి


వాటర్‌ప్లాంట్ వద్ద సుదర్శన్‌రెడ్డి, తదితరులు

ఘట్‌కేసర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గురుకుల్ కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. కళాశాలలో గతంలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించి సొంతఖర్చులతో మరమ్మతులు చేయించారు. అనంతరం రైల్వే వంతెన సమీపంలో అసంపూర్తిగా ఉన్న ప్రహరీ స్థానంలో దాత కందకట్ల మాధవరెడ్డి చేపట్టిన ఫెన్సింగ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో గురుకల్ పరిరక్షణ సమితి ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

కొడంగల్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో మంగళవారం శంకర కంటి ఆస్పత్రి హైదరాబాద్ వారి సౌజన్యంతో కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కంటివైద్య శిబిరం విజయవంతమైందని కంటి వైద్యులు మహేందర్ నికిత అన్నారు. ఈ శిబిరంలో 176 మందికి పరీక్షలు నిర్వహించగా 35మందికి కంటిలో శుక్లాలు ఉండడంతో వారిని ఆపరేషన్‌లకోసం శంకర కంటి ఆసుపత్రికి బస్సులో పంపించినట్లు తెలిపారు. వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలు పాటించాలి


భూసార పరీక్ష ఫలితాల పత్రాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ

కీసర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు అధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రకళ అన్నారు. 2025 మే, జూన్ తీసిన మట్టి నమూనాలకు గానూ నిర్వహించిన భూసారపరీక్షల ఫలితాల పత్రాలను మంగళవారం కీసర రైతు వేదిక వద్ద రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రాంరెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి మాదవీలత పాల్గొన్నారు.

దుద్యాల: ఆయిల్‌పామ్, వేరుశనగ పంటల సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు, ఏడీఏ శంకర్ రాథోడ్ అవగాహన కల్పించారు. మండలంలోని పోలెపల్లి రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఆన్‌లైన్ ద్వారా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మాణికేశ్వరి, దుకాణాదారుడు శ్రీశైలం యాదవ్, రైతులు బుగ్గప్ప, శివకుమార్, విశాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటన బాధాకరం


కొడంగల్: కొవ్వొత్తుల నివాళిలో జేఏసీ నాయకులు


తాండూరు ఆర్టీసీ డిపోలో రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సంతాప సభ


నవాబుపేటలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొడంగల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద సోమవారం జరిగిన ఆర్టీసీ బస్సు-టిప్పర్ రోడ్డు ప్రమాద ఘటన అత్యంత బాధాకరమని జేఏసీ నాయకులు అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపంగా మంగళవారం కొడంగల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సురేశ్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, పవన్‌కుమార్ లాహోటి, షాకీర్, రమేశ్‌బాబు, భీమరాజు, సూర్యనాయక్, మాసాని వెంకటయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దస్తగిరి బాబా మృతిపట్ల మంగళవారం తాండూరు ఆర్టీసీ డిపో రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు న్యాయవాది గోపాల్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో 13 మంది తాండూరు ప్రాంతం వారు మృతిచెందడం అందులో ఆర్టీసీ డ్రైవర్ ఉండటం బాధాకరమన్నారు. తాండూరు నుంచి జిల్లా కేంద్రం వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జబ్బర్, నాయకులు అనంతయ్య, లక్ష్మయ్య, వీరయ్య, ఎంకే రెడ్డి, తుకారం, శాంత్ కుమార్ ఉన్నారు.

నవాబుపేట: మీర్జాగూడ రోడ్డు ప్రమాద మృతులకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

ప్రమాదానికి ప్రభుత్వాలదే బాధ్యత

పరిగి/దోమ: చేవెళ్ల ప్రమాదానికి ప్రభుత్వాలదే బాధ్యత అని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్నేళ్లుగా రోడ్డు వెడల్పు పనుల విషయంలో జాప్యం జరుగుతోందని దీనికి గత, ప్రస్తుత ప్రభుత్వాలే కారణమన్నారు. 2018లో మంజూరైన ఈరోడ్డు పనులు ఏడేళ్లు గడిచినా ఇంత వరకు ఎందుకు పూర్తిచేయలేదని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల వైఫల్యమేనని విమర్శించారు. ఇప్పటికైనా రోడ్డడ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం


అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో చేస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని చేవేళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని మాదారం, కుమ్మరిగూడ, మూలమడ, చింతల్‌పేట్, మాదిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. చింతల్‌పేట్‌లో రూ.46లక్షలతో అదనపు తరగతి గదులు, మూలమాడ, మాదారం, కుమ్మరిగూడలో పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మాదిరెడ్డిపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో పీహెచ్‌సీకి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, ఎంఈవో అబ్దుల్ రహెమార్, కాంగ్రెస్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, తలారి ప్రభాకర్, రామ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మొహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

నాయకులకు వత్తాసు పలుకుతున్న అధికారులు


ఎక్సైజ్ జాయింట్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాగారం మున్సిపల్ ప్రజలు

కీసర రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నాయకులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి విమర్శించారు. మున్సిపల్ అనుమతులు లేకుండా మంగళవారం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని రాష్ట్ర మున్సిపల్ పరిపాలనా శాఖ డైరెక్టర్‌కు, స్థానికులకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్‌కు ఆయన వినతిపత్రాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ అధికార పార్టీ నాయకులంటేనే వనికిపోతున్నారని విమర్శించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీకౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నరేష్, నాయక్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

వికారాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రపంచ రహిత దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్, ఈకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇన్‌చార్జి మల్లేశం విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, డ్రాయింగ్, సాంగ్స్ పోటీలు, డిబేట్స్ నిర్వహించారు. కళాశాల సూపరింటెండెంట్ సయ్యద్, ఆచారి, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆర్టీసీని లాభాల బాటలో తీసుకెళ్లాలి

మేడ్చల్ టౌన్: ఆర్టీసీలో బస్సులు నడిపే డ్రైవర్లు ఇందన పొదుపు చేసి సంస్థను లాభాల బాటలో తీసుకెళ్లాలని మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్ అన్నారు. ఆర్టీసీ డిపోలో అత్యధిక ఇన్సెంటీవ్ పొందిన కండెక్టర్లకు, ఇందన పొదుపు చేసిన డ్రైవర్లకు మంగళవారం ప్రగతిచక్రాల పురస్కారం అందజేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

వికారాబాద్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ మీనాక్షి అన్నారు. బూర్గుపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో షీ టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర సమయాల్లో 100, 181, 1098, 112కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీటీమ్ ఇన్‌చార్జి బుచ్చిరెడ్డి, కళాజాత బృందం ఇన్‌చార్జి అశోక్, ప్రిన్సిపాల్ ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ 2.51లక్షల విరాళం

బషీరాబాద్: బషీరాబాద్‌లో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి తాండూరు పట్టణానికి చెందిన ఎస్వీరాములు కుమారుడు శ్రీకాంత్ రూ.2.51లక్షలు విరాళంగా అందజేశారు. ఈ నగదును ఆలయకమిటీ గౌరవ అధ్యక్షుడు సాయిలు గౌడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పవన్‌ఠాకూర్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు

శామీర్‌పేట: స్థానిక శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్‌పేటకు చెందిన గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తాండూరు రూరల్: చెన్‌గేష్‌పూర్ గ్రామానికి చెందిన కుర్వబీరమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీవీజీ ఫౌండేషన్ చైర్మన్, బాలాజీ ఆస్పత్రి డాక్టర్ సంపత్ కుమార్ బాధిత కుటుంబానికి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌గౌడ్ రూ.1000లు, శ్రీనివాస్ రూ.1000లు అందజేశారు.

ఏడు క్వింటాళ్ల నిబంధన ఎత్తివేయాలి

దౌల్తాబాద్: భారత పత్తి సంస్థ (సీసీఐ) ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామనే నిబంధన ఎత్తివేసి గతంలో మాదిరిగా ఎకరాకు 12క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకుడు కూర వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

పరిగి: రోడ్డు భద్రత, ట్రాఫిక్‌పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను మంగళవారం సందర్శించారు. అనంతరం రంగాపూర్ స్టేజీ వద్ద స్థానికులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మోహనకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

దోమ: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈవో వెంకట్ అన్నారు. మండలంలోని శివారెడ్డిపల్లి యూపీఎస్ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. అదేవిధంగా కేజీబీవీలో విద్యార్థులకు బెడ్‌షీట్స్ పంపిణీ చేశారు.

జిల్లా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనుల పరిశీలన


బిల్డింగ్ పనులను పరిశీలిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

వికారాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశీలించారు. బిల్డింగ్‌కు సంబంధించిన మ్యాపును పరిశీలించి, మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్‌డీవో వాసుచంద్ర, ఈఈ ఉమేష్ కుమార్, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ మండల వ్యవసాయ అధికారిగా శ్రీలత



కొడంగల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా శ్రీలత మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం, పంట ఉత్పాదకత పెంపు, వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రైతులు, వ్యవసాయ సహాయక సిబ్బంది సమన్వయంతో మండలంలో వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఎంపీడీవోకు సన్మానం

మోమిన్‌పేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సృజన సాహిత్యను మంగళవారం పలువురు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మల్లేశం, హెచ్ఎం మల్లారెడ్డి, పీఆర్‌టీయు అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యాయులు రాందాస్, సీఆర్‌పీ శ్రీనివాస్, ఐఈఆర్‌పీ మోహన్ ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ముగింపు

కీసర రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక శీతాకాల శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. చిన్నచిన్న సేవా కార్యక్రమాలు ద్వారా పెద్ద మార్పులు వస్తాయన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, కళాశాల పిన్సిపాల్ బండి రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలను తరలించొద్దు

కొడంగల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల తరలింపును నిరసిస్తూ కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం జేఏసీ నాయకులు కళ్లు, చెవులకు నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన తెలిపారు. 25రోజులుగా నిరసన కొనసాగిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సురేశ్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, పవన్‌లాహోటి, డాక్టర్ నవాజ్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కీసర, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కీసర రెవెన్యూ డివిజన్‌లోని పలు పురపాలక, నగర పాలక ప్రాంతాల్లో నూతన రేషన్ షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలో మొత్తం 15 నూతన రేషన్ షాపులు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం 5.00 గంటల లోపు కీసర ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తు, రుసుము రూ.250 సహా సమర్పించగలరని తెలిపారు. పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ఉంటుందని వెల్లడించారు.